క్లుప్తంగా

రహదారి భద్రతపై విద్యార్థుల ర్యాలీ



రహదారి భద్రతపై నినదిస్తున్న విద్యార్థులు

మధురవాడ: ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించి, సురక్షిత సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని మధురవాడకు చెందిన ఓ ప్రైవేట్ పాఠశాల విద్యార్థులు అవగాహన కల్పించారు. రహదారి భద్రతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా హెల్మెట్లు, సీట్ బెల్టులు ధరించాలని, మద్యం తాగి, అధిక లోడుతో వాహనాలు నడపరాదంటూ ప్లకార్డులు, బ్యానర్లు చేతపట్టి నినాదాలు చేశారు. కొమ్మాది జంక్షన్, మాస్టర్ ప్లాన్ రోడ్డు పరిసర ప్రాంతాల్లో ఈ ర్యాలీ సాగింది.

వాంబే కాలనీలో రెవెన్యూ సదస్సు నేడు

మధురవాడ: విశాఖ రూరల్ మండలం మధురవాడ రెవెన్యూ గ్రామం వాంబే కాలనీలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహిస్తున్నట్టు తహసీల్దారు పాల్‌కిరణ్ తెలిపారు. కాలనీలో 58వ వార్డు సచివాలయం ఆఫీసు కల్యాణమండపం వద్ద సదస్సు జరుగుతుందని పేర్కొన్నారు. ప్రజలు, రైతులు రెవెన్యూ సమస్యలపై రాతపూర్వకంగా ఫిర్యాదులు అందజేసి, సమస్యల పరిష్కారానికి ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

క్వారీ లారీ అసోసియేషన్ నూతన కార్యవర్గం



ఎన్నికైన నూతన కార్యవర్గం

తగరపువలస: జిల్లా క్వారీ లారీ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నికైంది. అధ్యక్షునిగా మద్దిల వెంకటరమణ, కార్యదర్శిగా బొట్ట సురేష్, కోశాధికారిగా వీడీఎం గిరి, వైస్ ప్రెసిడెంట్లుగా బొట్ట సురేష్‌కుమార్, కొయ్య శ్రీనివాస రెడ్డి, సహాయ కార్యదర్శులుగా మద్దిల శివ, ఆవాల రామకృష్ణ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని సోమవారం భీమిలి మండలం శింగనబందలో నాగవంశ సామాజిక సేవా సంఘం తరపున బొద్దు అప్పలనాయుడు అభినందించారు.

పాఠశాలకు నీటిశుద్ధి యంత్రం బహూకరణ

తగరపువలస: భీమిలి మండలం చిప్పాడ దివీస్ లేబరేటరీ యాజమాన్యం సోమవారం తూడెం ఎంపీపీ పాఠశాలకు రూ.1.25 లక్షల విలువైన వాటర్ ప్యూరిఫైర్ (నీటి శుద్ధి యంత్రం)ను అందించారు. కార్యక్రమంలో డైట్ అధ్యాపకులు కె.సూర్యారావు, ఎ.శ్రీనివాస్, అసిస్టెంట్ జీసీడీవో కె.గాయత్రి, దివీస్ సీఎస్ఆర్ మేనేజర్ డి.సురేష్‌కుమార్, ప్రతినిధులు శ్రీనివాస్, నరసింహ, ఉపాధ్యాయిని కమల పాల్గొన్నారు.

ఈతలో మెలకువలపై యువకులకు శిక్షణ



శిక్షణ పొందుతున్న యువకులు

కొమ్మాది: నీటి ప్రమాదాల్లో చిక్కుకునే వారిని కాపాడేందుకు నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వాటర్ స్పోర్ట్స్ (ఎన్ఐడబ్ల్యూఎస్) ఆధ్వర్యంలో ఈతలో శిక్షణ కార్యక్రమం రుషికొండ బీచ్‌లో సోమవారం సాయంత్రం ప్రారంభమైంది. ఈ శిక్షణలో ఈతలో మెలకువలు, కెరటాల్లో చిక్కుకున్న వారిని సకాలంలో ఒడ్డుకు చేర్చి ప్రాణాలు కాపా డే విధానం, ప్రాథమిక చికిత్స వంటి అంశాలపై పది రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు. ఈ తరహా శిక్షణ పొందిన వారిని పర్యాటక శాఖ బోటు షికారు సిబ్బంది, లైఫ్ గార్డ్స్ వంటి విభాగాల్లో ఉపాధి కల్పన ఉంటుందని తెలిపారు. ప్రస్తుతం 27 మంది యువకులు శిక్షణ పొందుతున్నారని తెలియజేశారు.

చెరువు ఆనవాళ్లే కరువు

- చుక్క నీటికీ నోచుకోని నమ్మివానిపేట చెరువు
- ఉసురు తీసిన బహుళ అంతస్తుల నిర్మాణాలు
- డెబ్రిస్‌తో కప్పేసి సమాధి చేస్తున్న రియల్టర్లు
- పట్టించుకోని అధికారులు

నిండుకుండలా తొణికిసలాడే నమ్మివానిపేట చెరువు రియల్టర్ల దాహానికి బలైపోయింది. పక్షి జాతుల సంతానోత్పత్తికి ఆధారంగా.. చెరువు చుట్టూ ఉండే చెట్లను నిర్దాక్షిణ్యంగా కూల్చేశారు. చుట్టూ ఆక్రమించేస్తూ.. చెరువును డెబ్రిస్‌తో కప్పేసి దాదాపు సమాధి చేసేశారు. అనుసంధానంగా ఉన్న గెడ్డలనూ మాయం చేసేశారు. దీంతో సుమారు 2.04 ఎకరాల విస్తీర్ణంలోని చెరువు చుక్క నీరూ లేక, ఆక్రమణలతో ఆనవాళ్లైనా లేక దీనస్థితిలో మిగిలిందిలా..



నమ్మివానిపేటలోని చెరువు

నమ్మివానిపేట-బ్యాంకు కాలనీ మార్గంలో చెరువును పూడ్చి వేసిన డెబ్రిస్

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ రెండోవార్డు నమ్మివానిపేటలోని సంగివలస రెవెన్యూ సర్వే నంబర్ 80లోని సుమారు 2.04 ఎకరాల విస్తీర్ణంలోని చెరువు చుక్కనీటి కోసం అర్రులు చాస్తోంది. ప్రస్తుతం చెరువు కింద కొందరు రైతులు మెట్ట పంటలు సాగు చేస్తున్నా, ఈ ప్రాంతంలో చేపడుతున్న బహుళ అంతస్తుల నిర్మాణాలు చెరువు ఉసురు తీస్తున్నాయి. నిర్మాణాలకు అడ్డు వచ్చిన చెట్లను తొలగించి, కూల్చిన పాత భవనాల డెబ్రిస్‌తో చెరువును నింపేస్తున్నారు. అనధికారికంగానే చెరువు చుట్టూ పార్కింగ్ స్థలాన్ని చదును చేసుకుంటున్నారు. ప్రతిరోజూ బ్యాంకు కాలనీ, ఆదర్శనగర్, సంగివలస ఈ మూడు మార్గాల నుంచే కాకుండా, ఇక్కడకు సమీపంలో ఉన్న మెడికల్ కళాశాల, ఆసుపత్రి నుంచి డెబ్రిస్‌ను తెచ్చి చెరువును సమాధి చేస్తున్నారు. గతంలో చెరువు చుట్టూ భూముల క్రయ, విక్రయాలు జరిపిన రియల్ ఎస్టేట్ వ్యాపారులే ఈ చెరువుకు మరణశాసనం రాసినట్టు తెలుస్తుంది. అధికారులు పట్టించుకోకపోవడంతో చెరువుకు అనుసంధానంగా ఉన్న గెడ్డలన్నీ కప్పేశారు.

సచివాలయానికి 100 మీటర్ల దూరంలోనే..

నమ్మివానిపేట వార్డు సచివాలయానికి కేవలం 100 మీటర్లు దూరంలోనే ఉన్న ఈ చెరువు ప్రస్తుతం దీనస్థితిలో ఉంది. పూర్వం ఈ చెరువులో నీటిని రైతులు వ్యవసాయానికి వినియోగించుకునేవారు. చెరువు నిండుకుండలా తొణికిసలాడేటప్పుడు చుట్టూ చెట్లపై వందల పక్షి జాతులు సంతానోత్పత్తి చేసుకునేవి. ఈ ప్రాంతంలో నేలబావులు, వ్యవసాయ బావులు, బోరుబావులలో సమృద్ధిగా నీరు లభించేది. వ్యవసాయం తగ్గుముఖం పట్టడం, ఈ ప్రాంతంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం పుంజుకోవడంతో సమీపంలో అంతర్జాతీయ స్కూళ్లు, మెడికల్, డెంటల్, నర్సింగ్ కళాశాలలు, స్టేడియంలు రావడంతో చెరువుకు గడ్డు రోజులు ఏర్పడ్డాయి. అప్పటి నుంచి చెరువు గర్భంతో పాటు చుట్టూ అంచులు పూడ్చి సగం చెరువును దిబ్బను చేశారు. సచివాలయాన్ని ఆనుకుని ఉన్న ఈ చెరువులో ప్రతిరోజూ ఎవరో ఒకరు వాహనాలతో డెబ్రిస్ వేసి యంత్రాలతో చదును చేస్తున్నా సిబ్బంది స్పందించడం లేదు. గతంలో ఈ ప్రాంతానికి చెందినవారు చెరువు గర్భంలో ఆలయం పేరుతో చేపట్టిన కాంక్రీట్ నిర్మాణాలు సాక్షిలో కథనాలతోనే తొలగించారు. అయినప్పటికీ చెరువు కబ్జా పనులు ఆగకుండానే సాగుతున్నాయి. దీని పరిరక్షణకు జీవీఎంసీ, ఇరిగేషన్ అధికారులు సానుకూలత చూపడం లేదు.

పూర్వ వైభవానికి వినతి

చెరువుకు పూర్వ వైభవం తీసుకురావాలని నమ్మివానిపేట, సంగివలస ప్రాంత వాసులు కోరుతున్నారు. దీనికోసం చెరువు గర్భంలో చెట్లను, డెబ్రిస్‌ను తొలగించి గెడ్డలను పునరుద్ధరిస్తే సమృద్ధిగా నీరు చేరి బోరుబావులలో ఏడాది పొడవునా నీరు చేరుతుందని అంటున్నారు. పట్టణీకరణ పెరుగుతున్నందున చెరువు చుట్టూ పార్కును అభివృద్ధి చేసి ఇందులో చేపల పెంపకం ద్వారా కూడా ఆదాయ వనరులు సమీకరించవచ్చని అంటున్నారు. భవిష్యత్తు తరాలకు జీవనాధారమైన చెరువును చిత్తశుద్ధితో రెవెన్యూ, జీవీఎంసీ, ఇరిగేషన్ అధికారులు రక్షించాలని కోరుతున్నారు.



ఇటీవల చెరువులో నిర్మాణం కూల్చి హెచ్చరిక బోర్డు పెట్టిన రెవెన్యూ సిబ్బంది



ఆదివారం చెరువు గట్టుపై వేసిన డెబ్రిస్

చెరువు రక్షణకు చర్యలు తీసుకుంటాం

నమ్మివానిపేట చెరువు చుట్టూ రాత్రివేళ చుట్టుపక్కల ప్రాంతాల నుంచి డెబ్రిస్ తీసుకువచ్చి పడేస్తున్నట్టు గుర్తించాం. గతంలో చెరువు ఆక్రమణను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి తొలగించాం. ప్రస్తుతం చెరువు ఆక్రమణలకు సంబంధించి, మళ్లీ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి చెరువు పరిరక్షణకు చర్యలు చేపడతాం. –హైదిరాజు, వీఆర్వో, నమ్మివానిపేట సచివాలయం

కిశోర బాలికలకు అండగా ఉందాం



కిశోర వికాసం అవగాహన పోస్టర్లు ప్రదర్శిస్తున్న ఐసీడీఎస్, మండల శాఖ అధికారులు



కార్యక్రమంలో పాల్గొన్న అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు, ఉపాధ్యాయులు

తగరపువలస: మన చుట్టూ ఉన్న కిశోర బాలికలకు ఆరోగ్యపరంగా, సమాజపరంగా రక్షణ కల్పిస్తూ అండగా ఉందామని ఐసీడీఎస్ పీడీ జి.జయదేవి అన్నారు. ఆనందపురం మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన కిశోర వికాసం ఒకరోజు అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. బాలల హక్కులు కాపాడుతూ బాల్య వివాహాల నిరోధానికి ప్రతి ఒక్కరూ నడుం బిగించాలన్నారు. కిశోర బాలికల విద్యకు ప్రాముఖ్యత ఇవ్వాలని సూచించారు. స్కిల్ డెవలప్‌మెంట్, పౌష్టికాహారం, నెలసరి సమయంలో పాటించవలసిన జాగ్రత్తలు, పరిశుభ్రతపై తరచూ అవగాహన కల్పించాలన్నారు. పోక్సో చట్టం గురించి తెలియజేశారు. ఈ శిక్షణ కార్యక్రమంలో సీడీపీవో ఎం.శ్రీదేవి, ఐసీపీవో శకుంతల, ఎంపీడీవో జానకి, జీసీడీవో ఖలీషా బేగం, ఎంఈవో గంగరాజు, ఆనందపురం పీహెచ్‌సీ వైద్యుడు గంగునాయుడు, ఎన్జీవో ప్రతినిధి డేవిడ్‌రాజు, స్కిల్ డెవలప్‌మెంట్ ప్రతినిధి అన్నపూర్ణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పీవీ రత్నం, రేఖావాణి, ఉమాజానకి, సరిత పాల్గొన్నారు.

హైందవ శంఖారావాన్ని జయప్రదం చేయండి



అంబేడ్కర్ కూడలిలో మాట్లాడుతున్న జన జాగరణ సమితి జిల్లా ప్రముఖ్ రాధాకృష్ణ

తగరపువలస: విజయవాడలో జనవరి 5న నిర్వహించనున్న హైందవ శంఖారావంలో లక్షలాది మంది పాల్గొని, కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని జనజాగరణ సమితి జిల్లా ప్రముఖ్ రాధాకృష్ణ కోరారు. అంబేడ్కర్ కూడలిలో సోమవారం సాయంత్రం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దేవాలయాలలో హైందవేతరులను నియమించి హిందువుల విశ్వాసాలతో ఆటలాడుకునే ధోరణి సమసిపోవాలన్నారు. దేశానికి స్వాతంత్రం వచ్చి 77 ఏళ్లు అయినా తమ దేవాలయాలను తాము నిర్వహించుకునే స్వతంత్రత నేటికీ హిందువులకు దక్కలేదన్నారు. సంస్కరణల ద్వారానే దేవాలయాలకు స్వయం ప్రతిపత్తి కల్పించాలని డిమాండ్ చేశారు. అంతకు ముందు వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డబ్బీరు ప్రశాంతి, జీరు సత్యనారాయణరెడ్డి, ఆదిమూలం నాగరాజు, మాల్యాద్రి, బింగి హరికిరణ్‌రెడ్డి, గ్రామ వికాస సమితి సభ్యులు గాడు వెంకట నారాయణ, వెంకటప్పడు, తాతినాయుడు, వెంకటరావు, గుజ్జు వెంకట పైడి సూరిబాబు, శీరపు వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆస్తుల విక్రయానికి యాజమాన్యం అడ్డదారి



జేసీఎల్ అధికారికి వినతిపత్రం అందిస్తున్న ఐక్య కార్మిక సంఘాల ప్రతినిధులు

తగరపువలస: కార్మికులకు పూర్తిగా పరిహారం చెల్లించకుండానే చిట్టివలస జ్యూట్‌మిల్లు యాజమాన్యం అడ్డదారుల్లో ఆస్తుల విక్రయానికి తెగించిందని మిల్లు ఐక్య కార్మిక సంఘాల ప్రతినిధులు ఆరోపించారు. దీనిపై చర్యలు తీసుకుని, కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం జేసీఎల్ కార్యాలయంలో సూపరింటెండెంట్ రవికి వినతిపత్రం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ మిల్లు ఆస్తులు అటాచ్‌మెంట్‌లో ఉండగా అడ్డదారిలో హైకోర్టు ద్వారా కేసుల మాఫీకి యాజమాన్యం ప్రయత్నిస్తోందన్నారు. ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు వెంటనే అధికారులు, యజమాని, కార్మిక సంఘాలను సమావేశపరచాలని కోరారు. కార్మికులకు పూర్తి పరిహారం చెల్లించేవరకు ఆస్తులు విక్రయించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పెండింగ్‌లో ఉన్న గ్రాట్యుటీ బకాయిల చెల్లింపు, అప్రెంటిస్ కార్మికులకు నష్టపరిహారం తదితర అంశాలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. కార్మిక సంఘాల నాయకులు జీరు వెంకటరెడ్డి, కొండపు ఈశ్వరరావు, దల్లి అప్పలరెడ్డి, సాడి అచ్చారావు, నరవ రామారావు, చిల్ల రాంపైడి తదితరులు పాల్గొన్నారు.

రేవిడిలో డ్రైనేజీ పునర్నిర్మాణానికి వినతి



డ్రైనేజీ పునర్నిర్మాణం గురించి తహసీల్దార్ ఆనందరావుకు విన్నవిస్తున్న మహిళలు

పద్మనాభం: మండలంలోని రేవిడిలో డ్రైనేజీ పునర్నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ గ్రామంలోని మహిళలు తహసీల్దార్ ఆనందరావును కోరారు. ఈ మేరకు కార్యాలయంలో ఆయన్ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఊళ్లో మురుగు నీరు పోయే కాలువ 30 ఏళ్లగా ఉందని, ఆ కాలువను ఓ మహిళ ఎవరి అనుమతి లేకుండా మూసివేశారని పేర్కొన్నారు. మురుగు పోయే మార్గం లేక, నిలిచిపోవడంతో ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని తెలిపారు. డ్రైనేజీ మూసివేతపై పంచాయతీ కార్యదర్శికి, సర్పంచ్‌కు ఫిర్యాదు చేయగా వారు వచ్చి కాలువను పరిశీలించగా.. ఆ మహిళ మరొకరితో కలిసి వారితో ఘర్షణకు దిగారని వినతి పత్రంలో పేర్కొన్నారు. డ్రైనేజీ పునర్నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో వైఎస్సార్ సీపీ నాయకుడు కోన రమణ ఉన్నారు.

రైతుబజారులో విక్రయాలు ప్రారంభించాలి

తగరపువలస: చిట్టివలసలో నిర్మించిన రైతుబజారులో వెంటనే విక్రయాలు ప్రారంభించాలని భీమిలి డివిజన్ సీపీఐ నాయకులు భీమిలి వ్యవసాయ మార్కెట్ కమిటీ అధికారులకు సోమవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా నాయకులు కానూరి రాంబాబు, మోర అప్పలరాజు తదితరులు మాట్లాడారు. ప్రైవేట్ మార్కెట్‌లో దళారీల కారణంగా కూరగాయల ధరలు మండిపోతున్నాయన్నారు. రైతుబజారును వెంటనే ప్రారంభించి, విక్రయాలు జరిగేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.

పీజీఆర్ఎస్‌కు ఏడు వినతులు



జోన్-2 కార్యాలయంలో ఇన్‌చార్జి జెడ్సీ ఫణిరాంకు వినతిపత్రం ఇస్తున్న అప్పలనాయుడు



వినతులు స్వీకరిస్తున్న జెడ్సీ ప్రేమ ప్రసన్నవాణి

భీమునిపట్నం: భీమిలి జోనల్ కార్యాలయం వద్ద జోనల్ కమిషనర్ ప్రేమ ప్రసన్నవాణి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్)కు ఏడు వినతులు వచ్చాయి. ఇందులో ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించి మూడు, ప్రజారోగ్య విభాగానికి రెండు, పట్టణ ప్రణాళిక విభాగానికి ఒకటి, రెవెన్యూ విభాగానికి ఒక వినతి వచ్చాయి. ఈ వినతులను పరిశీలించి ఆయా శాఖల ద్వారా త్వరలో పరిష్కరిస్తామని జెడ్సీ తెలిపారు.

జోన్ 2 పరిధిలో 15 ..

మధురవాడ: జీవీఎంసీ జోన్–2 మధురవాడ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు 15 వినతులు వచ్చాయి. ఇన్‌చార్జి జోనల్ కమిషనర్ ఫణిరాం అధ్వర్యంలో ఫిర్యాదులు స్వీకరించారు.

- జీవీఎంసీ 7వ వార్డు మిథిలాపురి వుడా కాలనీ–కార్‌షెడ్ జంక్షన్ వద్ద హైవేను ఆనుకుని జీవీఎంసీ గిఫ్ట్‌డీడ్ చేసిన సర్వే నెం. 248/10లో ఉన్న సుమారు 672 గజాలు స్థలాన్ని కాపాడాలని చంద్రంపాలేనికి చెందిన పిళ్లా అప్పలనాయుడు ఫిర్యాదు ఇచ్చారు.
- కొమ్మాది హౌసింగ్ బోర్డు కాలనీకి రోడ్లు, డ్రైన్‌ల నిర్మాణం కోసం టీడీపీ నాయకుడు గొల్లంగి ఆనందబాబు, పీఎం పాలెం విజేత సూపర్ మార్కెట్ వద్ద గవర్నమెంట్ భూమిని ఆక్రమించి చేపట్టిన కట్టడంపై చర్యలు చేపట్టాలని కుమార్, రేవళ్లపాలెం భాస్కరనగర్ లే అవుట్‌లో అక్రమ కట్టడాన్ని నిలుపుదలచేయాలని సీతారామాంజనేయులు ఫిర్యాదులు ఇచ్చారు.
- నగరంపాలెం, బక్కన్నపాలెం మాస్టర్ ప్లాన్ రోడ్ల నిర్మాణం కోసం, పీఎం పాలెం గాయత్రి నగర్ జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీ 1వ నెంబరు బ్లాక్‌లో కొత్త ట్యాంక్ ఏర్పాటు ఇలా జోన్‌లోని 9వ వార్డుల పరిధిలోని వివిధ ప్రాంతాల నుంచి పలు సమస్యలుపై 15 అర్జీలు వచ్చాయి. వీటిపై తక్షణ చర్యలు చేపడతామని జెడ్సీ హామీ ఇచ్చారు.
- పీజీఆర్ఎస్‌కు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు వస్తారని ప్రకటించి, దుమ్మా కొట్టడంతో ఆయనకు సమస్యలు తెలియజేయడానికి వచ్చిన పలువురు నిరాశతో వెనుదిరిగారు.

రేపటి నుంచి గీతాజయంతి మహోత్సవాలు

తగరపువలస: స్థానిక సత్యనారాయణ కొండపై ఈ నెల 11 నుంచి 28 వరకు గీతామందిరంలో గీతా ప్రచారసంఘం ఆధ్వర్యంలో గీతాజయంతి మహోత్సవాలు జరగనున్నాయి. ఇందులో భాగంగా బుధవారం ఉదయం 5 గంటలకు నగర సంకీర్తన, సాయంత్రం 4 గంటలకు గీతాచార్యుని పల్లకీ ఉత్సవం నిర్వహించనున్నారు. ప్రతిరోజూ మందిరంలో ఉదయం 6 గంటల నుంచి భగవద్గీతా పారాయణం, గీత అష్టోత్తర శతనామావళి పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. సాయంత్రం 6.30 గంటల నుంచి 8గంటల వరకు గీతాప్రవచన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ నెల 22న భగవద్గీతలోని మొదటి అధ్యాయం అర్జున విషాదయోగంపై మూడు వర్గాలుగా విభజించిన విద్యార్థులకు కంఠస్థ, పఠన, క్విజ్ పోటీలు నిర్వహించనున్నారు. 29న మధ్యాహ్నం నారాయణసేవ నిర్వహించి,సాయంత్రం విద్యార్థులకు బహుమతులు అందించనున్నారు.

బురదతో అవస్థలు



యాదవ వీధిలో రోడ్డు

పద్మనాభం: మండలంలోని పొట్నూరులోని యాదవ వీధిలో మట్టి రోడ్డు బురదగా తయారైంది. దీంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించానికి ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. వర్షాలు కురిస్తే రోడ్డు బురదమయంగా తయారై, 15 రోజుల వరకు చిత్తడిగానే ఉంటోందని పేర్కొన్నారు. ఈ మార్గాన్ని సిమెంటు రోడ్డుగా అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

రెవెన్యూ సదస్సులకు కానరాని స్పందన



కూటమి నాయకులు, వారి సమస్యలే ప్రస్తావన

భీమిలి తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న చిల్లపేట వాసులు



కొమ్మాదిలో జనాలు లేక వెలవెలబోతున్న సదస్సు

తగరపువలస: ప్రస్తుతం గ్రామాలలో జరుగుతున్న రెవెన్యూ సదస్సుల గురించి ప్రచారం లేకపోవడంతో ప్రజల నుంచి స్పందన కనిపించడం లేదు. దీంతో కూటమి నాయకులు, వారి సమస్యలే సదస్సులలో ప్రస్తావనకు వస్తున్నాయి. సోమవారం చిట్టివలస బొగ్గులరోడ్డు వార్డు సచివాలయంలో జరిగిన సదస్సులో అర్జీదారుల కంటే అధికారులు, కూటమి నాయకులే ఎక్కువగా కనిపించారు.

- చిట్టివలస సర్వే నంబర్ 77/2, 77/3, 77/4 భూమి ఆక్రమణకు గురవగా దీనికి సంబంధించి కేసు డీఆర్వో కోర్టులో నడుస్తున్నందున బాధితులు నాగిరెడ్డి, సీపీ రెడ్డి, ఎల్లయ్యమ్మ, అప్పలకొండ, లక్ష్మి తహసీల్దార్ రామారావుకు ఫిర్యాదు చేశారు. కొందరు ఎలాంటి డాక్యుమెంట్లు లేకుండా 1బీలో నమోదు చేసుకునే ప్రయత్నాలు చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు.
- రెండోవార్డు సంతపేట సర్వే నంబర్ 38/1, 38/2 గ్రామకంఠంలో 15 ఏళ్ల క్రితం వరకు రిజిస్ట్రేషన్లు అయ్యేవని ఇటీవల నిలిచిపోయాయని మాజీ కౌన్సిలర్ చేట్ల రమణ ఫిర్యాదు చేశారు.
- చిట్టివలస పేరు కనుమరుగు కాకుండా చూడాలని బల్లా వెంకటరావు అనే వ్యక్తి సదస్సులో ఫిర్యాదు చేశారు.
- ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా ప్రజోపయోగకర వసతులు కల్పించాలని మాజీ కౌన్సిలర్ పిట్టా సురేష్ వినతిపత్రం అందించారు.

పొట్నూరులో..

పద్మనాభం: మండలంలోని పొట్నూరులో సోమవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 127 మంది దరఖాస్తు చేసుకున్నారు. మ్యుటేషన్ కోసం 45 మంది, వన్ బీ కావాలని 11 మంది, కుల ధ్రువీకరణ పత్రాలకు 16 మంది, ఆదాయం ధ్రువపత్రాలకు 41 మంది, ఇతర సర్టిఫికెట్ల కోసం 14 మంది దరఖాస్తు చేసుకున్నారు.

కొమ్మాదిలో..

కొమ్మాది: రెవెన్యూ సదస్సులకు అధికారులు ఊహించినంత స్పందన రావడం లేదు. దీనితో నామమాత్రంగా సభను నిర్వహించి మమ అనిపిస్తున్నారు. జీవీఎంసీ 6వ వార్డు కొమ్మాది గ్రామంలోని కల్యాణ మండపంలో డీటీ జి.రాజేష్ అధ్యక్షతన నిర్వహించిన సదస్సుకు ప్రజల నుంచి పరిమిత స్థాయిలో స్పందన లభించింది. నవోదయ సమీపంలో 86 మంది రైతులకు పట్టాలు మంజూరు చేయాలని, కొమ్మాది శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలని, అదే విధంగా ఈ ప్రాంతంలో గెడ్డ ఆక్రమణలు, హద్దుల ఏర్పాటు, ఆన్‌లైన్ తదితర సమస్యలపై 35 ఫిర్యాదులు అందాయి. కార్యక్రమంలో ఆర్ఐ ఏవీ కిషోర్, స్థానిక నాయకులు సియాద్రి కనకరాజు, గుంటుబోయిన సంజీవ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మార్గశిర మాసం ఎంతో విశిష్టం



శిర్లపాలెంలో ప్రచారం నిర్వహిస్తున్న విజయరాంపురం కమిటీ ప్రతినిధులు

తగరపువలస: మార్గశిరమాసం ఎంతో విశిష్టమైందని త్రైత సిద్ధాంత భగవద్గీత, ప్రబోధ సేవా సమితి విజయరాంపురం కమిటీ అధ్యక్షుడు కె.త్రినాథరావు అన్నారు. భగవద్గీత మానవాళికి అందింది ఈ మాసంలోనే అని పేర్కొన్నారు. ఆనందపురం మండలం శిర్లపాలెం, పేకేరు, రేగానిగూడెం గ్రామాల్లో కమిటీ ప్రతినిధులు సోమవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా త్రినాథరావు మాట్లాడుతూ మార్గశిర మాసం విశిష్టత, వెలుగు, జ్ఞానం గురించి వివరించారు. దైవభక్తితో గ్రంథ పఠనం చేయాలన్నారు. మనం జ్ఞానమార్గంలో ప్రయాణించాలని సూచించారు. ధనుర్మాసంలో గురువును శరణు వేడి, ఉత్తరాయణంలో మోక్షం సాధించాలన్నారు. ప్రచార కార్యక్రమంలో ఎస్.అచ్చియ్యమ్మ, కె.సంతోష్, లక్ష్మి, భవాని, రాజు, మంగమ్మ పాల్గొన్నారు.